కథానిక

# సత్యమూర్తి కల

కొమ్మూరి ఉషారాణి

సత్యమూర్తి అప్పుడే భోజనంచేసి పడకకుర్చీలో కూర్చున్నాడు. మధ్యాహ్నం పన్నెండుగంటల వేళ. అతని తల్లి పనివాళ్ళమీద కేకలేస్తోంది. పిల్లలందరూ హడావుడిగా గోలచేస్తున్నారు. సత్యమూర్తికి చిరాకుగావుంది. దీనికితోడు అతని చెల్లెలు రుక్మిణి రేడియోలో "ప్రేమే నేరమౌనా" అనే పాట గట్టిగా పెట్టింది. అతనిక వుండలేక పోయాడు. "ఓసేయ్! రుక్కూ! ఆ వెధవపాట ఆపుతావా-ఆపవా? ప్రేమ నేరమవడమేమిటి? ఆపిచ్చి సినిమాసంగీతం వినీవినీ నీకుజబ్బుచేస్తుంది" అన్నాడు. సత్యమూర్తికి పాతికేళ్ళు. మెడికల్ కోర్సు చదువుతున్నాడు. పెళ్ళికాలేదు. అభ్యుదయ భావాలు, ఉన్నతాశయాలుగల యువకుడు.

"అన్నయ్యా! నీకోసరం ఎవరో వచ్చారు" అన్న తమ్ముడి కేకకి ఉలిక్కిపడ్డాడు. బద్ధకంతో హాల్లోకి వెళ్ళాడు. నల్లగా, పొడుగ్గా ఒకతను కుర్చీలోకూర్చునున్నాడు. కూలింగ్ గ్లాసులు, ఫెల్ట్ హేటు, నల్ల పంట్లాము, విచిత్రంగానేవున్నాడు. "ఓస్ మీరేనా" అని పలకరిస్తూ, అతని చేతిలో వున్న కాయితాలవంకా, టిక్కట్లు పుస్తకం వంకా, దిగులుగా చూశాడు మూర్తి. "ఆ, ఏమీ లేదండి. మా "ఎక్స్" సంఘంవాళ్లు సంక్రాంతి ఉత్సవం జరపటానికి నిశ్చయించుకున్నారు. దానికి మీలాంటి యువకుల సహాయం చాలా కావాలి" అంటూ టిక్కట్లపుస్తకం తీశాడు.

మూర్తి గుండెలో రాయిపడింది. అమ్మో! టిక్కట్లే! ఆడబ్బుకేమైనా వస్తుంది అనుకున్నాడు. ఆ వచ్చిన వ్యక్తిని ఎలా వదలించుకోవటమా అని బెంగతో కృశించిపోయాడు. ఎట్లాగయినా మంచి మాటలుచెప్పి, అతన్ని పంపించి వేయాలని, తనకున్న తెలివినంతా ఉపయోగించి ఆలోచించాడు.

"ఆగండి! ఆగండి!" అంటూ కుర్చీలోంచి ఒక్క గంతేసి ముందుకువంగి అతని చెయ్యిపట్టుకున్నాడు. "క్షమించాలి. నేను రేపు అర్జంటుగా ప్రయాణం చెయ్యవలసిన పనుంది. తిరిగి ఎప్పుడు వస్తానో తెలీదు" అన్నాడు గుటకలు మింగుతూ.

"అలా అనకండి. ఉత్సవం ఆదివారం సాయంత్రం మీరు రాకపోయినా, మీ వాళ్ళకైనా టిక్కట్లు తప్పక తీసుకోవాలి. విద్యార్థులయ్యుండీకూడా మీరామాత్రం చెయ్యలేకపోతే ఎలా చెప్పండి?" అన్నాడు విజయగర్వంతో.

మూర్తి పెద్ద చిక్కులోనే పడ్డాడు. ఏమి చేయటమా భగవంతుడా అంటూ బుర్రగోక్కున్నాడు. అయినా టోపీవాలాకి ఆ ముద్దేమిటి? ఇన్సూరెన్సు ఏజంటులాగా పట్టుకున్నాడే? ఏదో బంధుత్వం ఒరిగిపోతున్నట్లు ఆ బలవంతం ఏమిటి? అని లోపల తిట్టుకున్నాడు. "ఇదుగో చూశారా! మా వాళ్ళకి మీటింగులకి వెళ్ళటం అలవాటు లేదు. ఇంట్లో ఆడవాళ్ళకి పని తీరికే వుండదు. ఇహ నాన్నగారి సంగతి అసలు చెప్పనక్కరలేదు. మీకు ఆశాభంగం కలిగిస్తున్నందుకు ఏమీ అనుకోకండి" అంటూ కుర్చీలోంచి లేవబోయాడు. కాని టోపీవాలా అలాంటి మాటలకు లొంగే ఘటంగా కనుపించలేదు. చాలా గట్టి ప్రయత్నానికే పూనుకుని, టిక్కట్లమ్మి అందరికీ తిరుక్షవరం చేయించేవాడిలాగున్నాడు. "తప్పు తప్పు ఆదివారం సాయంత్రం ఓ రెండుగంటలసేపు మా సభకు విచ్చేసి, విజయవంతం చేయించటం మీలాంటివాళ్ళకి ఒక లెక్కా? ఒక ఉపన్యాసాలే కాదు. మా కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొంటున్నారు. మధ్యమధ్య డాన్సులు, సినిమా తారలు వేదికెక్కి ప్రేక్షకులకి కనుపించటం, చాలా బాగుంటుంది. ఇదిగో వినండి, ముందర సినీతార ఉత్కళ కుమారి ప్రార్థన, తరువాత బుర్రమీసాల నెంబరు "వన్" గారు కళలు, వాటి పోషణగురించి ఉపన్యసిస్తారు. జిడ్డు

మెంబరు "టు" గారు ప్రస్తుత విద్యా విధానాన్ని గురించి ప్రసంగిస్తారు. "అనుకోని కలయిక", "కార్మికులు" అనే రెండు నాటికలు వుంటాయి. నాలుగు మెంబరు "త్రీ" గారు కుండ పెంకులు, బొచ్చెలు మొదలగు వాటిని గురించి మాట్లాడుతారు" అని గుక్క తిప్పుకోకుండా ఇంకా చెప్పబోతున్నాడు.

మూర్తి అడ్డువచ్చి "ఆగండి ఇంక చాలు" అనగానే టోపీవాలా అదిరిపోయి తలెత్తి చూసాడు. "మిగతా కార్యక్రమం మీరు చెప్పనక్కరలేదు. నేను ఊహించుకోగలను, ఏమిటో అనుకున్నాను. తలనొప్పి మాత్రలకి డబ్బు దండగ కాకుండా పైగా టిక్కట్లుకూడా కొనమంటున్నారు. మా అమ్మకి చాలా రోజులనుంచి మందు తీసుకోగా మొన్ననే తలనొప్పులు తగ్గాయి. క్షమించాలి. కాంప్లిమెంటరీ లిచ్చినా మేము రాము" అని ఖచ్చితంగా చెప్పాడు. టోపీవాలా ముఖం ఎర్రబడింది. చేతిలో కాయితాలు వణుకుతున్నాయి. "ఛీ! డబ్బున్న వాళ్ళకిదే జబ్బు. చూస్తో చూస్తో ఒక్క అయిదు రూపాయలుపెట్టి టిక్కట్టుకొని ఏ సంస్థనైనా పోషించలేరు" అన్నాడు.

మూర్తి కసలే విసుగ్గావుంది. ఆమాటలు అతని కోపాన్ని మరింత రెచ్చగొట్టాయి. ఒక బిందెడు చన్నీళ్లు వాడి నెత్తిన పొయ్యాలనిపించింది. "ఏమండోయ్! మాటలు కొంచెం తిన్నగా రానీయండి-యేమనుకున్నారేమిటి? ఎవర్ని ఉద్ధరించటానికి ఈ సంఘాలూ, ఈ సమావేశాలు? ఐన కాడికి అందరిళ్ళకీ వెళ్ళి, టిక్కట్లు కొనమని గొంతుమీద కూర్చోటానికేనా? చాలు చాల్లెండి. ఇలా సభలు ఏర్పాటుచేసి అందరి ప్రాణం తియ్యకపోతే ఏదైనా ఉపయోగకరమైన పని చెయ్యరాదూ? నాలాగా ఎంతమందిని దుంప తెంపి మొహమాటపెట్టి డబ్బు గుంజారో ఇంత వరకు!" అని నాలిక కొరుక్కున్నాడు మూర్తి. అలా అన్నాడేగాని, అంతటి పెద్దమనిషి మనసు నొచ్చుకుంటాడేమోనని చింతించక పోలేదు.

ఈసారి టోపీవాలా లేచి నిల్చున్నాడు. పాంటుజేబులో రెండుచేతులూ పెట్టుకుని యిలా అన్నాడు: "మా ఎక్సు సంఘం యెందుకు పెట్టామో తెలుసా? మావి అభ్యుదయ భావాలు. మేమెప్పుడూ ముందంజలువేస్తూ వుంటాము. దేశాన్ని ఎన్నివిధాలుగా ఉద్ధరించటానికి వీలుంటుందో, మా సభల్లో తీర్మానాలు చేస్తూంటాము. బీదలకీ, గొప్పవాళ్ళకీవున్న తేడాలని రూపుమాపి, పేదలకి జరిగే అన్యాయాలను అరికట్టడానికి మేము కంకణం కట్టుకున్నాము. సంఘంలో వున్న చీడపురుగుల్ని ఎత్తి బైటపడేసి, దానిని శుభ్రపరచటమే మా ముఖ్యోద్దేశము. మీలాటి వాళ్లు ఓ అయిదు రూపాయలుపెట్టి టిక్కట్టు కొనకపోతే మా సభ విజయవంతం కాదనుకుంటున్నారేమో? మాకు రాజపోషకులు చాలా మంది వున్నారు. ఇంతేకాక ప్రముఖుల ఉపన్యాసాలు వినే అవకాశం మీకుమళ్ళీదొరకదు."

మూర్తి వెంటనే ఇలా అందుకున్నాడు, "చాల్లెండి. యింక మీసభకి ఎంతమందివస్తారో నాకు తెలుసు. మీ కళ్ళనీళ్లు తుడవడానికి అందరూ వస్తామంటారేగానీ, చక్కటి ఆదివారం సాయంత్రం ఎవరుపాడుచేసుకుంటారు. ఏ బీచికో వెళతారు. అయినా ఏముందక్కడ రావటానికి? బుర్రమీసాల కవిగారు ఉపన్యాసాలకి ఆయన్ని ఎవరు పిలుస్తారా అని కాచుకున్నారు. ఆయన మాట్లాడటం మొదలు పెడితే ఇంక అంతం అంటూ వుండదు. నాయుడు పంతులుగారి ఉపన్యాసం మాట చెప్పనక్కరలేదు. చెప్పదలచుకున్నదేమిటో తేల్చి చెప్పడు. మాటలు సరిగా వినపడనివ్వడు. పోనీ అదైనా ఎంతకీ ముగియనివ్వడు. ఏదోఏదో వాగుతాడు. మధ్యన ఏవో పద్యాలు కూడా చదువుతాడు అపస్వరంగా. ఇహ జిడ్డుస్వామిగారి ఉపన్యాసం వినటంకంటే జీవితంలో ఘోర పొరపాటులేదు. ఆ మధ్యన ఆయనకి మతి చలించిందని కూడా యెవరో అన్నారు. ఆయన ఉపన్యాసంవింటే మామూలు వాడికికూడా పిచ్చెక్కుతుంది. అరున్నర శ్రుతిలో అరుస్తాడు. మీకో దండం బాబూ! దయ చెయ్యండి." అన్నాడు.

టోపీవాలా కోపంగా బూట్సులు చప్పుడు చేసుకుంటూ వెళ్ళిపోయాడు. ఆ తొందరలో కార్యక్రమం కాయితాలన్నీ బల్లమీద వదిలేసి వెళ్ళాడు. సత్యమూర్తి నీరసంగా ఒక కాయితం తీసి చదువుకుంటూ, పక్కమీదపడుకుని, టోపీవాలాని తనుబాగా ఏడిపించాననే సంతోషంతో

కళ్లు మూసుకున్నాడు. చేతిలో కాయితం అలాగే వుంది. మూర్తికి మంచి నిద్ర పట్టింది.

అతనికో పెద్ద కల వచ్చింది. శనివారం సాయింత్రం స్నేహితులొచ్చి కాంప్లిమెంటరీ టిక్కట్లిచ్చి వెళతారు. మూర్తికి ససేమిరా వెళ్ళటము యిష్టం వుండదు. ఇంట్లో అందరూ, టిక్కెట్లు వూరికే వచ్చాయిగదా బయలుదేరుదామంటారు. అబ్బ! రుక్మిణి డ్రస్సు చేసుకునేటప్పటికి తెల్లారుతుంది. ఇంట్లోవున్ననగలన్నీ దిగేసుకుని, పట్టుచీర చుట్టబెట్టుకుని తయారవుతుంది. అక్కడకి వచ్చేవాళ్లందరూ ఆమెనిచూడటానికే వస్తున్నట్లు! కాని ఏంలాభంలేకపోయింది-స్నేహితుల బలవంతం మీద బయలుదేరుతాడు.

హాలు దగ్గిరకి వెళ్ళేటప్పటికి ఆరుగంటలవుతుంది. సగంపైన కుర్చీలు నిండిపోయుంటాయి. కాంప్లిమెంటరీ గనుక సత్యమూర్తీ, స్నేహితులూ ముందు వరుసలో కూర్చోటానికివెళతారు. కాని ఓ బక్కపల్చని కుర్రాడు. అడ్డువచ్చి, "మీరు వెనకాల కూర్చోవాలి. ఎరేంజిమెంటులు సరిగా చేయనందున ఇలాంటి చిక్కులు వచ్చాయి. ముందు వరుసలు రెండూ, అధ్యక్షుడి కుటుంబానికీ, సినిమాతారలకీ రిజర్వు చేయించాము" అంటాడు. అదీ ఒకందుకు మంచిదే అనుకుని మూర్తి వెనక్కి నడుస్తాడు-అతని స్నేహితులు మటుకు, సినిమా తారలని దగ్గిరగా చూసే అవకాశం పోగొట్టుకున్నందుకు దిగులుపడతారు. మూర్తి ప్రేక్షకులందరి ముఖాలు తాపీగా చూస్తాడు అందులో ఏ ఒక్కరూ టిక్కట్లుకొని వచ్చినట్లు అతనికి కనిపించదు. అన్నీ కాంప్లిమెంటరీ ముఖాలులాగే వుంటాయి. ఇంతలో సెక్రటరీ వేదికెక్కి "సోదర సోదరీమణులారా! ఆలస్యమవుతున్నందుకు క్షమించాలి. ప్రార్థన పాడవలసిన ఉత్కళికకుమారిగారు, షూటింగు వుండటమువల్ల యింకా రాలేదు. ఆలస్యంగా వస్తున్నందుకు క్షమించమంటూ చీటిపంపారు" అని నమస్కరించి వెళ్ళిపోతాడు.

ఉన్నట్లుండి హాల్లో పెద్ద అలజడి ప్రారంభమవుతుంది. చాలామంది ఉత్సాహంతో లేచి నిల్చుని చూస్తుంటారు. మూర్తి కూడా అదేమిటో తెలుసుకుందామని, ముందరివాళ్ళ తలకాయల మధ్య, తన తల దూర్చి చూస్తాడు. ఎవరో సినిమాతార వస్తోవుంటుంది. ఆవిడముందర టోపీవాలా, సెక్రటరీ, పూర్వం మహారాజులకి త్రోవచూపిస్తూ నడిచే సేవకులమల్లే, చేతులతో ఆమెకి దోవ చూపిస్తూ, నడుస్తారు. ఆమె వెనకాల ఓ పదిమంది యువకులు, అంతటి అదృష్టం తమకే కలిగిందనే గర్వం ముఖంపెట్టి వెడుతూ వుంటారు. సదస్యులందరూ ఆనందం పట్టలేక ఒళ్లు తెలియని సంతోషంతో చప్పట్లు కొడతారు. సాక్షాత్తూ వెంకటేశ్వరుడు ప్రత్యక్షమయితే, ఎంత ఆనందం పొందగలగటానికి వీలుంటుందో, అంత ఆనందం ప్రేక్షకుల ముఖాన్న తాండవమాడడం మూర్తి చూస్తాడు. ఆ తారాలలామను మెత్తటి సోఫా కుర్చీలో కూర్చోపెట్టి ఫాను తిప్పుతాడు సెక్రటరీ.

చాలామంది డబ్బు తగలేసి టిక్కట్లు కొన్నవారు, ఆలస్యంగా వచ్చి చోటులేక అవస్థపడుతారు. అభ్యుదయం ప్రధానాశయంగా కలిగి, ధనికులకీ, బీదలకీ వున్న తేడాలని లెక్కచేయని ఎక్సు సంఘంవాళ్లు, డబ్బుగలవాళ్ళని ముందర తీసుకెళ్లి కూర్చోపెడుతూ, మధ్యతరగతివాళ్ళని వెనక్కి నెట్టేయడం చూస్తే, మూర్తి కాశ్చర్యం వేస్తుంది. ఇంతలో "వై" మంత్రిగారు సాధారణ దుస్తులతో వస్తారు. పాపం! అదే సమయంలో ఉత్కళికకుమారిగారు విచ్చేయటమువల్ల ఆయన ముఖం కేసి చూసినవాళ్లు ఎవరూ వుండరు. ప్రార్థనలతో తెర ఎత్తుతారు. ఆ లతాంగి ఏం పాడిందో, ఎవరికీ వినిపించదు. అంతోటి పాటకీ యమడ్రస్సులో వస్తుంది. ఆ కాస్సేపటిలో ఈగలు ముసిరినట్లు ఆమె చుట్టూ ఫొటోగ్రాఫర్లు చుట్టుకుంటారు. ప్రేక్షకులందరూ చప్పట్లు కొడుతూ, ఆమెనింకొపాడమని వేడుకొంటూంటే "క్షమించాలి. ఇవాళే నాకు పడిశం పట్టింది. గొంతు నొప్పిగావుంది. మళ్ళీ రాత్రి షూటింగు కూడా వుంది" అని కులుక్కుంటూ వేదికమీంచి కిందికి గంతేసి, మాయమవుతుంది.

ఇక ఉపన్యాసాలు ప్రారంభమవుతాయి. కళలను గురించి మాట్లాడవలసిన బుర్రమీసాల కవిగారు, ఆయ నెన్ని పుస్తకాలు రాసాడో, ఆయన తెలివితేటల్ని ఎంతమంది మెచ్చుకున్నారో ఆయ నెన్ని దేశాలుచూశాడో తెగ వాగుతాడు. ప్రేక్షకుల్ని నవ్వించాలని ఎంతో ప్రయత్నించి

విఫలుడవుతాడు. ఆయన మాటలకి ఆయనే నవ్వు కుంటాడు కాని, ఒక్కళ్ళూ నవ్వరు. సత్యమూర్తికి తలకాయ నొప్పి సగం వస్తుంది. జేబులోంచి తలనొప్పి మాత్ర తీసి, సోడా తెప్పించి నోట్లో వేసుకుంటాడు. తరువాత నానుడు ం తులుగారు కళ్ళజోడు సరిజేసుకుని, ఖద్దరు కండువా సర్దుకుని చేతిలోంచి పెద్ద కాయితాల కట్ట తీస్తాడు. చిన్న చిన్న అక్షరాలు వ్రాశాడేమో ఎంతసేపయినా ఒక్క కాయితమూ పూర్తికాదు. కుండ పెంకులనూ, బొచ్చెలను గురించి మాట్లాడవలసిన ఆయన, ఊర్వశీ, శాకుంతలల వర్ణనలలోకీ శృంగారరసం లోకీ ఎందుకు దిగుతాడో మూర్తి కర్థంకాలేదు.

సినిమా తారలందరూ వేదికెక్కటము పూర్తవటము వల్ల కాబోలు, చాలామంది ప్రేక్షకులు యింటికి వెళ్ళిపోతారు. ముందు సీటు ఖాళీ అవటము వల్ల , కాళ్లు రెండూ జాపుకుని, తలకాయ బద్ధకంగా పక్కకి వేలాడేసి, తలకాయ నొప్పి ఎక్కువవటం వల్ల, ఇంకో మాత్ర మింగుతాడు. "ఇంక పోదాంరా?" అంటాడు స్నేహితులతో. "అబ్బ! వుండరా. తార శృంగారేశ్వరీదేవి ఆలశ్యంగా వస్తుందిట. ఇంతదూరం వచ్చినవాళ్లం ఆవిడను గూడా చూసిపోదాం." అంటారు స్నేహితులు. మూర్తికి మెల్లగా నిద్ర పడుతుంది.

మళ్ళీ అతను కళ్లు తెరిచేటప్పటికి నానుడు పంతులుగారు ఒక చెయ్యి నడుంమీద పెట్టుకుని, అధ్యక్షుడి బల్లమీదకు వంగి, రెండోచేత్తో కాయితాల కట్ట పట్టుకుని, చదువుకు పోతూ వుంటాడు. మూర్తి కళ్లు నలుపుకుని, గడియారం వంక చూసుకునేటప్పటికి, పదిన్నర అయి వుంటుంది. హాలంతా ఖాళీగావుంటుంది. ఒక్క పిట్టగూడాలేరు. అతని స్నేహితులుగూడా ఎప్పుడో ఉడాయిస్తారు. ఇక వెళదామని మూర్తి లేచి నిల్చుంటాడు.

ఉన్నట్లుండి, అధ్యక్షుడు లేచి నిలబడి, "ఏంయ్! ఎందుకు లేచావు? కూర్చో! ఇందాకటి నుంచీ నిద్రపోతూవుంటే పోనీ పాపమని వూరుకున్నాను. పెద్దలు మాట్లాడుతూంటే అలా లేచిపోవటం భావ్యమేనా? పైగా నువ్వొక్కడివే హాల్లో వున్నావు. నువ్వున్నావు వున్నావనే ఉత్సాహంతో పంతులుగారు ఉపన్యసిస్తున్నారు. నువ్విలాలేచి పోవటం మన సంఘానికీ, సంస్కారానికీ, దేశానికీ, తీరని అపచారం" అంటాడు. "ఇది చాలా బాగుంది. ఇప్పటికే పది దాటింది. నాకు బస్సులు దొరకవు. అందరూ వెళిపోతే ఈ అంతులేని ఉపన్యాసం వినటానికి నేనే దొరికానా మీకు?" అంటూ వెళిపోబోతాడు మూర్తి.

టోపీవాలా, శక్రటరీ, వాలంటీర్లూ అతన్ని చుట్టుకుంటారు. "ఇదిగో మీ కాలేజీలో పంతులుగారికి మంచి పలుకుబడుంది. టోపీవాలా వచ్చినప్పుడే, మీరాయనిగురించి ఏదో అవకతవకగా మాట్లాడారట. అది వినే ఆయన ఉగ్రుడయాడు. వెళ్ళకండి. లేకపోతేమీకు కాలేజీలోంచి ఉద్వాసన తప్పదు" అని బెదరిస్తాడు శక్రటరీ. మూర్తి అతని మాటలకు భయపడడు. ముందుకు వెళిపోబోతాడు. ఉన్నట్లుండి, అధ్యక్షుడూ, పంతులుగారూకూడా, వేదిక దిగొచ్చి మూర్తి చొక్కా పట్టుకుని, లోపలికి తీసుకు వెళ్ళటానికి ప్రయత్నిస్తారు. ఇహ చెయ్యి చేసుకోక పోతే లాభంలేదని పళ్లు బిగపట్టి, మూర్తి వాళ్ళతో కలియబడతాడు. కొంచెం పుష్టిగలవాడేమో, అందర్నీ బాగానే కొట్టగలుగుతాడు. అందరిలో పంతులుగారికి ఎక్కువ దెబ్బలు తగులుతాయి.

వాళ్ళని తన్నేసి పారిపోతున్న మూర్తిని, అందులో కొంతమంది వెంబడిస్తారు. తనమీద గాయాలతో, ఒళ్ళంతా ముచ్చెమటలు పోస్తూ, అతి కష్టంమీద యిల్లు చేరుకోగలుగుతాడు మూర్తి. నాన్నగారు జరిగిన ఘర్షణంతా విని మందలిస్తారు. మర్నాడంతా విశ్రాంతి తీసుకుంటూ మంచంమీదే వుంటాడు. సాయింత్రం టపాలో—మూర్తి నడవడి సరిగా లేనందుకు కాలేజీలోంచి డిస్‌మిస్ చేస్తున్నామంటూ వుత్తరం వస్తుంది.

* * *

సత్యమూర్తి ఖంగారుతో నిద్రనుండిలేచాడు. తువ్వాలుతో ముఖం తుడుచుకుని, గాయాలేమన్నా వున్నాయేమోనని, వళ్ళంతా చూచుకున్నాడు. గడియారం మూడూ కొట్టింది. తను వట్టి కలకన్నాననీ నిజంకాదనీ, తెలుసుకుని నవ్వుకున్నాడు.